

నిజాంపట్నం వద్ద ఆరు మీటర్లు ముందుకు వచ్చిన సముద్రం

రానున్న 24 గంటల్లో..

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కృతికా శుక్లా యంత్రాంగానికి దిశానిర్దేశం
- సహాయక చర్యలకు రూ.50 లక్షలు విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మొంథా తుపాను నేపథ్యంలో నరసరావుపేట జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు కురిస్తే సహాయ చర్యల కోసం ముందస్తుగా ప్రభుత్వం రూ.50 లక్షలు విడుదల చేసింది. కలెక్టర్ కృతికా శుక్లా ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టరేట్, డివిజినల్, తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. శిథిలావస్థ భవనాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తీవ్రగాలులు వీచే సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. తుపాన్ తీవ్రత తగ్గే వరకు అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్ సిబ్బంది ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడైనా చెట్టు కూలితే వెనువెంటనే తొలగించడానికి కట్టర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 24/7 కంట్రోలు రూంలు పనిచేయాలని ఆదేశించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండే కల్వర్టులు, కాజ్‌వేలు, వాగులను ప్రజలు దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు అంగన్ వాడీ కేంద్రాలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు.



ముంచుకొస్తున్న మొంథా

- నేటి అర్ధరాత్రి తర్వాత తీరం దాటనున్న తుపాను
- ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మొదలైన వర్షాలు
- సహాయ చర్యలకు యంత్రాంగం సన్నద్ధం
- నిజాంపట్నంలో 6 మీటర్లు ముందుకొచ్చిన సముద్రం
- హార్బర్‌లో 3వ ప్రమాద హెచ్చరిక

నరసరావుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం మొదలైంది. సోమవారం ఉదయం నుంచే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిలాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఆకాశం చీకట్లు కమ్మేసింది. బాపట్ల, గుంటూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్, పల్నాడు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలను ఇప్పటికే విపత్తుల శాఖ జారీ చేసింది. మొంథా కాకినాడ తీరానికి దగ్గరవుతున్న కొద్దీ ఉమ్మడి జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారుతూ వస్తోంది. రాత్రి గాలులు లేకుండా తుపాన్ ముందు ప్రశాంతత కనిపించింది. తీర గ్రామాల్లో మాత్రం 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో మోస్తరు గాలులు మినహా పెద్దగా అలజడి కనిపించ లేదు. వర్షం మాత్రం విరామం లేకుండా పడుతూనే ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శని, ఆదివారాల్లోనే మున్సిపాలిటీ లు, నగర పంచాయతీల్లో ప్రధాన డ్రెయిన్ల పూడిక తొలగించారు. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు, రేపల్లె, బాపట్ల మున్సిపాలిటీల్లో వర్షంలోనూ పూడికతీత పనులు చేస్తూనే ఉన్నారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ముంపు సమస్య లేకుండా చూస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత కాకినాడ తీరం వద్ద తుపాను తీరం దాటనుంది. ఈ నేపథ్యంలో తుపాను ప్రభావం మూడు రోజులు ఉంటుందని ప్రభుత్వం హెచ్చరికలు చేయడంతో జనం అన్ని రోజులకు సరిపడా సరకులు, కూరగాయలు సమకూర్చుకునేందుకు దుకాణాలకు బారులు తీరారు. దీంతో కూరగాయల ధరలను పట్టణ ప్రాంతాల్లో పెంచేశారు. రాత్రి వరకు వర్షం మాత్రమే పడుతుండటం, గాలుల తీవ్రత లేకపోవడంతో ప్రస్తుతానికి ఈ జిల్లాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంత ప్రజలను పునరావస కేంద్రాలు, షెల్టర్లు, సురక్షిత భవనాల్లోకి తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ జిల్లాల్లో అంచనా వేసినంత వర్షపాతం నమోదయితే, సమస్యలు లేకుండా చూసేందుకు యంత్రాంగం సమాయత్తం అయింది.

పంటలపై ప్రభావం

తుపాను ప్రభావం అధికంగా ఉంటే.. పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో 4,56,563 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వరి,కంది, పత్తి, మిరప పంటలు సాగు చేశారు. వరి 1.40 లక్షలు, పత్తి 2.27 లక్షలు, కంది 77,333, మిరప 76 వేలఎకరాల్లో సాగయ్యాయి. అయా పంటలు భారీ వర్షానికి నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాలు కురిస్తే పంటలు కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులు రైతులకు తెలియజేస్తున్నారు.



నిజాంపట్నం హార్బర్‌లో నిలిచిన బోట్లు



నిజాంపట్నం సముద్రం వద్దకు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరిక బోర్డు



సూర్యలంక తీరం ఒడ్డున ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం



మూడో నంబరు ప్రమాద హెచ్చరిక

మొంథా తుపాను ధాటికి నిజాంపట్నం వద్ద సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. ఆదివారం వరకు ఒకటవ ప్రమాద హెచ్చరికను ఎగురవేస్తే.. ఉదయం నుంచి 3వ హెచ్చరికకు మార్చారు. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలన్నీ తుపాన్‌కు ముందే ఒడ్డుకు చేరాయి. బాపట్ల జిలాల్లోని నిజాంపట్నం, సూర్యలంక తీరంలో సముద్రం అలలు 7 నుంచి 8 అడుగుల మేర ఎగసిపడుతున్నాయి. సముద్రం 6 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. ఐదురోజులుగా జెట్టీలకే పరిమితమైన బోట్లలోనే మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అలల ఉధృతి విపరీతంగా ఉండడంతో కాకినాడకు చెందిన మెరైన్‌బోటు నిజాంపట్నం హార్బర్‌కు చేరుకుంది. పునరావస కేంద్రాలు, తుపాను షెల్టర్ల వద్ద అధికారులు ఎవరూ కనిపించడం లేదు.



రాజుపాలెం : ఉప్పలపాడు వద్ద ఎద్దు వాగును పరిశీలిస్తున్న ఆర్డీవో రామాకాంత్ రెడ్డి, తహసీల్దార్ సరోజ



పిడుగురాళ్ల వద్ద గాలులకు నేలకొరిగిన వరి పైరు

పల్నాడులో కంట్రోల్ రూం నంబర్లు

- కలెక్టరేట్ : 08647-252999

ఆర్డీఓ కార్యాలయాలు

- నరసరావుపేట : 9949067438
- గురజాల: 9177243579
- సత్తెనపల్లి : 08641-2334000



నిజాంపట్నం హార్బర్‌లో వలలను శుభ్రం చేసుకుంటున్న మత్స్యకారులు

వంతెనలు.. ప్రమాద ఘంటికలు



చిన్నకంచెర్ల వద్ద ప్రమాదకరంగా వంతెన

శావల్యాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శావల్యాపురం నుంచి కొత్తలూరు వెళ్లే దారిలో అలాగే.. చిన్నకంచెర్ల నుంచి పిచికలపాలెం వెళ్లే దారిలో కొంకేరు వాగుపై ఉన్న వంతెనలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఈ రెండు వంతెనలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వంతెనలకు ఇరువైపులా రెయిలింగ్ లేక ప్రజలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వంతెనలు పునర్నిర్మిస్తామని నేతలు చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. శావల్యాపురం మండలంలోని కొన్ని గ్రామాలను ఆనుకొని కొంకేరువాగు ప్రవహిస్తుంది. కొత్తలూరు సమీపంలోని వంతెనను నిర్మించి సుమారు 50 ఏళ్లకుపైబడుతోంది. శావల్యాపురం నుంచి కొత్తలూరు, తుమ్మలకుంటల మీదుగా ఈపూరు మండలంలోని వివిధ గ్రామాలకు, హైదరాబాద్ మార్గాన్ని చేరుకొనేందుకు నిత్యం ప్రయాణికులు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇరువైపులా రెయిలింగ్ లేక రాత్రిళ్లు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలకు వాగు పొంగిన ప్రతీసారి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. నీటి ఉధృతి తగ్గేవరకు ప్రయాణికులు ఇతర గ్రామాలకు వెళ్లలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నకంచెర్ల, పిచికలపాలెం మధ్య చిన వంతెనపై గుంతలు పడి.. ఇరువైపులా రెయిలింగ్‌లు లేక ప్రమాదకరంగా మారింది. ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రవాణశాఖ విస్తృత తనిఖీలు

- 25 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు, బస్సు సీజ్

నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి పల్నాడు జిల్లాలోని పలు ప్రధాన రహదారులపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్ తెలిపారు. పేపర్లు సరిగా లేని, నిబంధనలు పాటించని 17 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇందులో అత్యవసర ద్వారం లేనివి 8, రహదారి భద్రత ఉల్లంఘన 4, రిఫ్లెక్సన్ టేపు లేనివి 3, ప్రయాణికుల జాబితా లేనిది ఒకటి, అగ్నిమాపక యంత్రం లేని మూడు బస్సులు ఉన్నట్లు వెల్లడించారు. మాచర్లలో ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును సీజ్ చేసినట్లు తెలిపారు. 25 బస్సులపై రూ.95,900 అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించని బస్సులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.




ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణ శాఖ అధికారులు



క్షీరాభిషేకం



పసుపుతో..



కుంకుమతో..




విభూదితో



గంధంతో



ఎండు ఫలాలతో



విశేష అలంకారంలో..

వైభవంగా రుద్రాభిషేకం

కోటప్పకొండ(నరసరావుపేట), అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురస్కరించుకొని త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీ మేధా దక్షిణా మూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కడలిలోకి .. కృష్ణమ్మ పరుగులు

- 'జల ఆశయాలు' దాటి.. వరద ప్రవాహం
- సంద్రంలో కలిసిన 1,466.7 టీఎంసీలు
- 18 ఏళ్లలో రికార్డు స్థాయిలో నదికి వరద
- నిండు కుండలా ప్రాజెక్టులు కళకళ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మ సాగర్ అయకట్టులో పరుగులిడుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. దీంతో లక్షలాది ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అన్నదాతల మోముల్లో అనందం వెల్లివిరుస్తోంది. నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్‌కు కృష్ణమ్మ పోటెత్తింది. 18 ఏళ్లలో రికార్డు స్థాయిలో కృష్ణా నదికి వరద వచ్చింది. ఇప్పటి వరకు 1,466.7 టీఎంసీల వరద నీరు కడలిలో కలసిపోయింది. జులైలో ప్రారంభమైన వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

అక్టోబరులో రికార్డు స్థాయిలో సాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ ఉండటం విశేషం. దిగువన ఉన్న జలాశయాలు నిండుకుండలా కళ కళాడుతున్నాయి. సాగర్ కుడి కాలువకు నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా ల్లోని కుడి కాలువ అయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. వచ్చే ఏడాదికి కూడా సాగు నీరుకు ఢోకా ఉండదని, వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ అధికారుల అంచనా.

నిండు కుండలా సాగర్..

సాగర్ (మిగతా 8వ పేజీలో)

సముద్రంలో కలసిన కృష్ణా జలాలు (ఈ నెల 27వరకు)

నెల	నీరు టీఎంసీలలో
ఆగస్టు	639.47
సెప్టెంబరు	573.87
అక్టోబరు	253.36

నేడు, రేపు మిర్చియార్డుకు సెలవులు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా ఈ నెల 28, 29 తేదీలు మంగళ, బుధవారాలలో మిర్చియార్డుకు సెలవు ప్రకటించినట్లు జీఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని రైతులు, ట్రేడర్లు, కార్మికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సెలవులను ప్రకటించామన్నారు. కేవలం మిర్చి లావాదేవీలు మాత్రమే జరగవని, మార్కెట్ కమిటీ పరిపాలన కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు, ట్రేడర్లు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ గడువు 3 నెలలు పొడిగింపు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం విధించిన గడువును మరో మూడు నెలలు పొడిగించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నిర్ణయం తీసుకుంటూ ప్రభుత్వ ఆమోదంతో ఉత్తర్వులు జారీ చేసింది.

జాబ్ మేళా వాయిదా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించ తలపెట్టిన జాబ్ మేళాను నవంబరు 11కు వాయిదా వేసినట్లు జిల్లా నైపుణ్యాధికారి ఈ తమ్మాజీ సోమవారం తెలిపారు. అభ్యర్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాయిదా వేశామన్నారు. మరింత సమాచారం కోసం 9642194600, 9573247861, 8121360425, 9160200652 నంబర్లను సంప్రదించాలన్నారు.

రవికుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం



ఏఎన్‌యూ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రవికుమార్ బొప్పనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు సోమవారం రీసెర్చ్ సెల్ కో- ఆర్డినేటర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధన పర్యవేక్షకులుగా ఆర్.శివరామ ప్రసాద్ ఉన్నారు. 'సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ట్రెడిషనల్ మీడియా-యాన్ అనాలిసిస్.' అనే అంశంపై రవికుమార్ పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. రవికుమార్ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌కు మీడియా లైజన్ ఆఫీసర్‌గా, అలాగే గవర్నర్‌కు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖలకు మీడియా సమన్వయకర్తగా ఉన్నారు. ఈ సందర్భంగా పరిశోధకులు, విద్యార్థులు రవికుమార్‌కు అభినందనలు తెలిపారు.

జిల్లా పరిషత్ మీటింగ్ జరిగేనా..!

గుంటూరు సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో ఈ నెల 29 బుధవారం రోజున జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో అసలు సర్వసభ్య సమావేశం జరుగుతుందా, లేదా అన్న ప్రశ్న ఉద్భవిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రజా ప్రతినిధులు రావా ల్సి ఉండగా వర్ష ప్రభావం వల్ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని భావిస్తున్నా రు. తుఫాన్ తీవ్రత గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనే ఎక్కువగా ఉంటుందన్న నేపథ్యం లో సమావేశం నిర్వహణపై అనుమానం వ్యక్తం అవుతుంది. సమావేశం తేదీ ప్రక టించారు కాబట్టి రద్దు చేసే అవకాశం ఉండదని, ఒక వేళ తగినంత మంది జడ్పీటీ సీలు హాజరు కాకపోతే కోరం లేనందున వాయిదా వేసే అవకాశం ఉంటుందని తెలుస్తుంది.

రూ.35.71 కోట్లు పోయినట్లేనా..!



● జడ్పీకి రావాల్సిన సర్‌చార్జిపై అనుమానాలు ● గతంలో నేరుగా స్థానిక సంస్థల ఖాతాలో జమ
● సీఎఫ్‌ఎంఎస్ వచ్చాక రాష్ట్రం చేతుల్లోకి
● అక్కడ నుంచి రావటం ఇక గగనమే

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

పరిపాలనలో సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు తీసుకుంటున్న కొత్త నిర్ణయాలు స్థానిక స్వపరిపాలన సంస్థల నడ్డి విరుస్తున్నాయి. ఒకప్పుడు నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమయ్యే సర్‌చార్జి కూడా సీఎఫ్‌ఎంఎస్ (సెంట్రల్ ఫండ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం)కు వెళ్లటం పెను శాపంలా పరిణమించింది. జగన్ జమానాలో సీఎఫ్‌ఎంఎస్‌కు వెళ్లిన నిధులు తిరిగి స్థానిక సంస్థలకు రాకపోవటంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ రూ. 35.17 కోట్లు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఆ సమస్యపై దృష్టి సారించి పరిష్కారం చూపుతుందన్న ఆశ రోజురోజుకు అడగంటుతోంది.

● గతంలో చెల్లింపులు స్థానికంగానే..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్ రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి వచ్చే సర్‌చార్జి (ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) అత్యంత ప్రధానమైంది. గతం లో ఈ చెల్లింపులు స్థానికంగానే జరిగేవి. కాబట్టి పెద్దగా పెండింగ్‌లు ఉండేవి కావు. సీఎఫ్‌ఎంఎస్ వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వద్ద నుంచి వసూలు చేసే సర్‌చార్జి నేరుగా సీఎఫ్‌ఎంఎస్‌కు వెళ్తుంది. దానిని ఆర్థికశాఖ అధికారులు పరిశీలించి విడుదల చేయాలి. 2014-2019 మధ్య ఆ చెల్లింపులు సక్రమంగానే జరిగాయి. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత సీఎఫ్‌ఎంఎస్‌కు వెళ్లిన సర్‌చార్జ్‌ను కూడా ప్రభుత్వం వాడుకోవటం ఆరంభించింది. ఆ సొమ్ము స్థానిక సంస్థలకు విడుదల చేయటానికి సినిమా చూపిస్తూ వచ్చింది. ఆ రకంగా గుంటూరు జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జి కోట్లలో పేరుకు పోయింది. కూటమి ప్రభుత్వం కూడా గడచిన 16 నెలలుగా ఆ ఊసే ఎత్తటం లేదు.

రావాల్సింది రూ.35.17 కోట్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు సర్‌చార్జ్ రూపేణా రావాల్సిన సొమ్ము వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా నుంచి 2022-2023లో రూ.46 లక్షలు, 2024-2025లోరూ.1.15 కోట్లు, 2025-2026లో రూ.57 లక్షలు రావాల్సి ఉంది. పల్నాడు జిల్లా నుంచి 2024-2025 లో రూ.5.57 కోట్లు, 2025-2026లో 5.62 కోట్లు, గుంటూరు జిల్లాలో 2022-2023లో రూ.7.60 కోట్లు, 2024-2025లో 10.90 కోట్లు, 2025-2026లో 5.62 కోట్లు జిల్లా పరిషత్‌కు రావాల్సి ఉంది. మొత్తం సుమారుగా రూ.35.17 కోట్లు సర్‌చార్జి సొమ్ము రావాల్సి ఉందని జిల్లా పరిషత్ అధికారులు చెబుతున్నారు.

సీఎం, మంత్రులను కలిశాను



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జి నిధులను విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశాను. ఆ తర్వాత రాష్ట్ర మంత్రులను కూడా కలిసి అదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లాను. జిల్లాలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ నిధులు వస్తేనే కానీ పనులు జరిగే పరిస్థితి కనబడడం లేదు. కాబట్టి ప్రభుత్వం జడ్పీకి రావాల్సిన సర్‌చార్జిను వెంటనే విడుదల చేస్తుందని ఆశిస్తున్నాను.

-కత్తెర హెనీ క్రిస్టీనా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, గుంటూరు

కొనసాగుతోన్న వరద ఉధృతి


తాడేపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 69,630 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు.



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

1.0921 ఎంయూల విద్యుత్ తయారీ

రెంటచింతల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్రశాల నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0921 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.50 మీటర్ల మేర, 1 గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 24,116 క్యూసెక్కులు, టేల్‌రేస్ చానల్ ద్వారా 8,650 మొత్తంగా 32,766 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 32,762 క్యూసెక్కుల నీరొస్తోందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు. ఇప్పటివరకు 58 ఎంయూల విద్యుత్ తయారైందని తెలిపారు.



టేల్ రేస్ చానల్ ద్వారా విడుదలవుతున్న నీరు

గుంటూరులో మూడేళ్ల బాలుడి కిడ్నాప్

● రూ.6 లక్షలు డిమాండ్ ● సాంకేతిక పరిజ్ఞానంతో కేసు ఛేదన

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి, వదిలేందుకు రూ.ఆరు లక్షలు డిమాండ్ చేసి లేదంటే చంపేస్తానని బెదిరించిన మహిళను



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్

పాత గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. బాలుడిని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం, తన మూడేళ్ల కుమారుడు కిడ్నాప్‌కు గురయ్యాడని గుంటూరు ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ షఫివుల్లా పాత గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షఫివుల్లాకు వదిన అయినా పటాన్ షకీలా అప్పులపాలై తన తండ్రి ఇంట్లో వారం రోజులుగా ఉంటోంది. అప్పుల నుంచి బయటపడేందుకు షఫివుల్లా కుమారుడైన మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో బాలుడిని కిడ్నాప్ చేసింది. చెన్నైలో ఉన్న బాలుడి అన్న షేక్ షహితుల్లాకు ఫోన్ చేసి బాలుడిని కిడ్నాప్ చేశానని, తనకు రూ.6 లక్షలు ఇస్తే వదిలేస్తానని, లేకపోతే చంపేస్తానని బెదిరించింది. దీంతో షహితుల్లా ఫోన్ చేసి షకీలా బెదిరించిన విషయాన్ని బాలుడి తండ్రి షఫివుల్లాకు తెలిపారు. షఫివుల్లా పాత గుంటూరు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే అప్రమత్తమైన సీఐ వెంకట ప్రసాద్ సాంకేతిక పరిజ్ఞానంతో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని ఆమె చెర నుంచి విడిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితురాలు షకీలాను కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆర్టీసీపై తుఫాన్ ఎఫెక్ట్

● సగం మంది ప్రయాణికులతో పలు సర్వీసుల రాకపోకలు ● నేడు, రేపు పలు సర్వీసులు రద్దు ● డీపీటీవో సామ్రాజ్యం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీపై మొంథా తుఫాన్ ప్రభావం సోమవారమే కనిపించింది. సగం మంది ప్రయాణికులతోనే పలు సర్వీసులు రాకపోకలు సాగించాయి. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ప్రయాణికుల్లేక వెలవెలబోయింది. అలాగే గుంటూరుతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లోనూ అడపా దడపా ప్రయాణికులతోనే సర్వీసులు రాకపోకలు సాగించాయి. దాంతో పలు బస్సు సర్వీసులను కూడా తగ్గించుకోవాల్సి వచ్చింది. మంగళ, బుధవారాల్లో మొంథా తుఫాన్ హెచ్చరికలతో ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారిగా (డీపీటీవో) సోమవారమే బాధ్యతలు స్వీకరించిన డి.సామ్రాజ్యం వెను వెంటనే తుఫాన్ ప్రభావంపై అధికారులతో సమీక్షించారు. డిపోల వారీగా మేనేజర్లతో రూట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూట్‌ల వారీగా సమీక్షించిన డీపీటీవో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా తుఫాన్ ప్రభావం మంగళ, బుధవారాలు అత్యధికంగా ఉంటుందని ఇప్పటికే వాతావర ణశాఖ ప్రకటించటంతో గుంటూరు-1, 2 డిపోల నుంచి మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోలలో కూడా సర్వీసులను తగ్గిస్తున్నట్లు డీపీటీ వో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారని, తద్వారా రద్దీ ఉండటం లేదని దాంతో సర్వీసులను తగ్గిస్తున్నట్లు చెప్పారు. ఇక బస్సుల రాకపోకలు సాగించే అమరావతి రూట్, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి రూట్ లలో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరద పరిస్థితులను అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా కొన్ని సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

నేడు ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ స్నాతకోత్సవం

● ముఖ్య అతిథిగా మంత్రి లోకేశ్

తుళ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో విద్యార్థులకు డిగ్రీల ప్రదానం జరగనుంది. ఈ కార్యక్రమా నికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు యూనివర్సిటీలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. యూనివర్సిటీలో 2020-25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ చదివిన 1877 మంది విద్యార్థులకు, మరో 39 మంది పరిశోధనా విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఇందులో 45 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు, ఏడుగురు స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు, నలుగురు లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగియనుంది. సోమవారం ఉదయం యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమారు ఆడిటోరియంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో యూనివర్సిటీ కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, గవర్నింగ్ బాడీ మెంబర్లు పాల్గొననున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తాడేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెనుమాక ఉండవల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 70 సంవత్సరాలు వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. వృద్ధుడి ఒంటిపై కాఫీపొడి రంగు చొక్కా, బ్లూ కలర్ పూల లుంగి ఉన్నాయని, తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి తెలిపారు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, మృతుడికి సంబంధించి వ్యక్తులు ఎవరైనా ఉంటే తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కారు డిక్కీలోంచి జారి పడిన బ్యాగు

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు ● బ్యాగులో నగదు ఉన్నట్లు వెల్లడి

దాచేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కారు డిక్కీలో పెట్టిన బ్యాగు జారి కిందపడి పోయిందని సోమవారం ఓ వ్యక్తి దాచేపల్లి పోలీసులను ఆశ్రయించారు. బ్యాగులో నగదు ఉన్నట్లు ఆయన పోలీసులకు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, దాచేపల్లి మండలం ఇరికేపల్లికి చెందిన భవణం పుల్లారెడ్డి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఇరికేపల్లిలో సమీప బంధువులు మృతిచెందడంతో వారిని పరామర్శించేందుకు స్వగ్రామానికి వచ్చి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామం దాటిన తరువాత పర్సు కోసం జేబులో వెతికారు. అది కనిపించకపోయే సరికి డిక్కీలో ఉన్న బ్యాగులో ఉండేమోనని వెతికారు. బ్యాగులో పర్సు లేదు. ఇరికేపల్లిలోని బంధువులను ఫోన్‌లో సంప్రదించగా పర్సు అక్కడే ఉన్నట్లు సమాచారమిచ్చారు. పర్సు కోసం తిరిగి ఇరికేపల్లి చేరుకొని నేరుగా హైదరాబాద్ వెళ్లారు. అక్కడకు వెళ్లిన తర్వాత డిక్కీలో చూడగా నగదుతో ఉన్న బ్యాగు కనిపించలేదు. శ్రీనగర్ దాటిన తరువాత పర్సు కోసం డిక్కీని వెతికినప్పుడు బ్యాగు జారిపోయిందేమోనని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి



జేమ్స్ (ఫైల్‌ఫోటో)

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం దుగ్గిరాల మండలం మంచికల పూడి గ్రామ సమీపంలో జరిగింది. మంచికలపూడిలోని దళిత కాలనీకి చెందిన గౌతుమాసు జేమ్స్ (30) మంచికలపూడి రైల్వే గేటు వేసి ఉన్న సమయంలో రెండులైన్లు దాటి మూడో లైన్‌పైకి వస్తుండగా రైలు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జేమ్స్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెల్డింగ్ పనులు చేసుకుని జీవించే జేమ్స్‌కు భార్య లావణ్య, మూడేళ్ల కుమార్తె అక్షయ, ఏడాది కుమార్తె అక్షిత ఉన్నారు. జేమ్స్ మృతితో మంచికలపూడిలో విషాదఛాయలు అలముకున్నాయి జేమ్స్ తండ్రి ఇటీవలే మృతిచెందారు. జేమ్స్‌మృతితో వారి కుటుంబ పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంటూరు డీపీటీవోగా సామ్రాజ్యం



డీపీటీవో విమల నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న సామ్రాజ్యం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రజా రవాణాధి కారిగా (డీపీటీవో) డి.సామ్రాజ్యం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాపట్ల డీపీటీవోగా వ్యవహరిస్తున్న ఆమె బదిలీపై గుంటూరుకు వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీటీఎమ్ సత్యనారాయణ, వీవో మాలతి, ఏటీఎం సాంబశివరావు, గుంటూరు-1, 2 డిపో మేనేజర్‌లు రామకృష్ణ, సునీత ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో డీపీటీవో సామ్రాజ్యంకు అభినందనలు తెలియజేశారు. కాగా, ఇప్పటి వరకు గుంటూరు డీపీటీవోగా వ్యవహరించిన సీహెచ్ విమల బాపట్లకు బదిలీ అయ్యారు.

గోవిందాపురంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

మాచవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన ఘటన మాచవరం మండలంలోని పాత గోవిందాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, గుర్తు తెలియని వ్యక్తులు పాత గోవిందాపురంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్ళి దేవాలయం లోపల ఉన్న కంకరను పగల గొట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఒక భక్తుడు తన మొక్కుబడి తీర్చుకొనేందుకు ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు వెళ్లాడు. అతన్ని చూసిన ఆ వ్యక్తులు ఒక్కసారిగా పరారయ్యారు. భక్తులు, గ్రామస్థులు విషయాన్ని మాచవరం పోలీసుస్టేషన్‌కు చేరవేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. నిందితులు అక్కడ వదిలి వెళ్ళిన రెండు ద్విచక్ర వాహనాలు, గడ్డపారలు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దేవాదాయశాఖ ఈవో శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే దేవాలయంలో ఎలాంటి వస్తువులు అపహరణకు గురి కాలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఏఎన్‌యూ క్యాంపస్ కళాశాలలకు సెలవులు

● వసతి గృహాల విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

ఏఎన్‌యూ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రంగా మారుతుందనే హెచ్చరికలతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యంత్రాంగం అప్రమత్తమైంది. క్యాంపస్ కళాశాలలకు సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆదేశాలతో కూడిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం సోమవారం జారీ చేశారు. ఈ మేరకు సోమవారం తరగతులకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులను మధ్యాహ్నం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి గమ్యస్థానాలకు చేర్చారు. విశ్వవిద్యాలయంలోని పరిపాలన విభాగాలు యథావిధిగా పనిచేస్తాయని రిజిస్ట్రార్ ఉత్తర్వులలో సూచించారు. భారీ వర్షం పడినప్పుడల్లా విశ్వవిద్యాలయంలోని అశోక, గౌతమి వసతి గృహాల్లోకి నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడటాన్ని దృష్టిలో ఉంచుకున్న అధికారులు ఆయా వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులను వేరే చోటుకు తరలించి ప్రత్యేక వసతి సదుపాయం కల్పించారు. వారికి అదనంగా భోజన సదుపాయంతోపాటు వైద్య సదుపాయం అందుబాటులో ఉంచారు. తుఫాన్ దృష్ట్యా ఇంజనీరింగ్ బాలుర వసతి గృహాలతో పాటు మహిళా వసతి గృహాల్లోని విద్యార్థులు బయటకు వెళ్లకుండా వార్డెన్లు, అధ్యాపకులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తల్లిదండ్రుల అనుమతితో రవాణా సదుపాయం ఉన్న ప్రాంతాల విద్యార్థులను మాత్రమే వసతి గృహాల నుంచి వారి స్వస్థలాలకు వెళ్లడానికి అనుమతి ఇస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

41,568 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 42,383 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,568 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,039 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	15200
నెంబరు. 5	10000	14200
273	----	---
341	10000	16000
4884	----	----
సూపర్ 10	10000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15100
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	15100
దేవనూరు డీలక్స్	10000	14300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	12500
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	15000
నెంబరు. 5	10000	14500
273	---	----
341	10000	16200
సూపర్ 10	11000	14700
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి	10000	15200
దేవనూరు డీలక్స్	10500	14400
తాలుకాయలు	5000	8000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



పిడుగురాళ్లలో సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు

పిడుగురాళ్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీసంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం కార్తీకశుద్ధ షష్ఠి సందర్భంగా నాగులగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలు, విశేషద్రవ్యాలతో అభిషేక కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, మాలధారులు పాల్గొన్నారు. వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం నుండి ఆదిశేష వాహనంపై కావడి ఊరేగింపు వైభవంగా జరిగింది. దేవస్థాన అధ్యక్షుడు గుదె నాగసతీష్ పాల్గొన్నారు.

దేవరంపాడు హుండీ ఆదాయం రూ.3.92 లక్షలు

రాజుపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరంపాడు కొండపై ఉన్న శ్రీ నేతి వెంకన్నస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3,92,911 వచ్చినట్లు ఈవో సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ లీలావతి, వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నకరికల్లులో వైద్య శిబిరం

నకరికల్లు అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా సోమవారం నకరికల్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. వైద్యశిబిరం మంగళవారం కూడా కొనసాగుతుందని డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.



వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు

సత్తెనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎద్దులదొడ్డి శ్రీనివాసరావును నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు

సత్తెనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల బహ్రెయిన్‌లో జరిగిన యూత్ ఆసియన్ గేమ్స్‌లో భారత పురుషుల కబడ్డీ జట్టులో స్వర్ణం పతకాన్ని గెలుచుకున్న క్రీడాకారుడు గద్దె హరీష్‌ను సోమవారం తెలుగుయువత నాయకులు గౌస్, ఏకో ఓవర్‌సీస్ కన్సల్టెన్స్ సిబ్బంది అభినందించారు. హరీష్‌కు ఏకోఓవర్సీస్ కన్సల్టెన్సీ స్పాన్సర్‌షిప్ అందించింది.

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ ఎందుకు?

సత్తెనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఇప్పుడు ఎందుకని ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 2011 సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన పలువురు 25 నుంచి 30 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్నారన్నారు. వారు ఇప్పుడు టెట్ అర్హత సాధించాలని చెప్పటం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారిని అవమానించటమేనన్నారు. ప్రభుత్వాలు ఈ విషయాన్ని సమీక్షించి సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

సత్తెనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ నిర్వాకం వల్లనే శిశువు మృతి చెందిందంటూ బాలింత బంధువులు ఆదివారం రాత్రి ఆందోళన చేశారు. పట్టణానికి చెందిన శిరీష రెండురోజుల క్రితం ప్రసవం నిమిత్తం ప ట్టణంలోని ప్రశాంతి ఆస్పత్రిలో చేరింది. ఆదివారం రాత్రి శిరీష ప్రసవం జరిగింది. శిశువు మృతి చెందింది. దీంతో శిరీష బంధువులు డాక్టర్ నిర్లక్ష్యం వలనే శిశువు మృతిచెందిందని, డాక్టర్ ప్రశాంతి కాన్పుచేయకుండా జూనియర్ డాక్టర్‌తో వైద్యం చేయించటమే శిశువు మృతికి కారణమని బంధువులు ఆరోపించారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు.

ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు

దాచేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసం దాచేపల్లిలోని నూర్ మసీదులో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 23 మసీదుల నుంచి మత పెద్దలు జమాత్ సభ్యులు వెయ్యిమంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నూర్ మసీదు కమిటీ జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత గొడవలే.. పార్టీకి సంబంధం లేదు

పిడుగురాళ్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం పిడుగురాళ్ల జడ్‌పి కాంప్లెక్స్ దుకాణం విషయంలో జరిగిన గొడవ వ్యక్తిగతంగా జరిగిందేనని కరెడ్ల చినసాంబశివరావు తెలిపారు. ఈ నెల 22వ తేదీన షాపు వద్ద జరిగిన గొడవ పూర్తిగా వ్యక్తిగతమని కూటమి నేతలకు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ఎటువంటి సంబంధం లేదని ఆయన వివరించారు. కూటమి నేతలపై చేసిన ఆరోపణలు సరిదిద్దుకుంటున్నామని సాంబశివరావు దంపతులు తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 41.38 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 35,650 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, రెండుగేట్ల ద్వారా 40,834, మొత్తం 57,834 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

మొంథా తుపానుపై అధికారులు అప్రమత్తం



రాజుపాలెం: ఉప్పలపాడులో ఎద్దు వాగును పరిశీలిస్తున్న ఆర్డీవో రామాకాంత్ రెడ్డి, తహసీల్దార్ సరోజ

సత్తెనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో సత్తెనపల్లి ప్రాంతంలోని అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్డీవో రమణాకంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, సిబ్బంది సోమవారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. నరసరావుపేట రోడ్డులోని ప్రధాన మురుగుకాలువను శుభ్రం చేయించారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న లోలెవల్ చప్టాలను పరిశీలించారు. చప్టాల వద్ద వ్యర్థాలను శుభ్రం చేయించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలకేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు సిద్ధంగా ఉన్నారు. వర్షం, గాలులు వీచే సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలకు దగ్గరలో ఉండకూడదని ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి సూచించారు. రాజుపాలెం మండలంలోని బలిజేపల్లి, ఉప్పలపాడు గ్రామాల్లోని వాగులను పరిశీలించి అక్కడ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వాగుల వద్ద, లోలెవల్ చప్టాల వద్ద నీరు నిలబడకుండా చర్యలు చేపట్టారు. తుఫాన్ నేపథ్యంలో పట్టణంలోని 24వ వార్డులో అన్ని మురుగుకాలువలను సచివాలయ శానిటరీ సెక్రటరీ గౌరీశంకర్, పారిశుధ్య సిబ్బందితో కలసి టీడీపీ నేతలు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వరరావు, జింకా లోకేశ్వరరావు, దేవతి శివ ప్రసాదు, ఫణిదరపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మూడు రోజులపాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, రాజుపాలెం మండలంలోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామాకాంత్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడు, బలిజేపల్లి గ్రామాల సమీపంలోని ఎద్దువాగును పరిశీలించారు. మండలంలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గణపవరంలోని లోతట్టు కాలనీలను సందర్శించి ఏబీఎం ఎలిమెంటరీ పాఠశాలలో పునరావాస కేంద్రాలకు కాలనీవాసులను తరలించాలిందిగా మండల అధికారులను ఆదేశించారు. విపత్తును ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పంచాయితీ రాజ్, విద్యుత్తు, పోలీసుశాఖలు సిద్ధంగా ఉండాలన్నారు. తహసీల్దార్ సరోజ మాట్లాడుతూ ప్రజలందరూ నిత్యావసరాలు ముందే తెచ్చుకోవాలన్నారు. అత్యవసర సాయం కోసం 9963084109 నెంబరుకు సంప్రదించాలన్నారు. ఎంపీడీవో పగడాల ముక్కంటి, ఎంఈవో నరసింహరావు, పంచాయతీ రాజ్ ఏఈ నరసింహారావు, పీఎస్ మహకాళమ్మ తదితరులు ఉన్నారు.

నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

● రెవెన్యూ అధికారుల విస్తృత ఏర్పాట్లు

పిడుగురాళ్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావం వల్ల పంట, ప్రాణ నష్టం జరుగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు వహించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సోమవారం నియోజకవర్గం వ్యాప్తంగా రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, ఉద్యాన, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. అధికారులు సమన్వయంతో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు, సూచనలు అందించాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు తగు సూచనలు ఇచ్చి పంట నష్టం జరుగకుండా చూడాలన్నారు. మరో రెండు రోజులు వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం వున్నందున అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ మధుబాబు తెలిపారు.

● మాచవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమయ్యారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి గ్రామాల్లో తుఫాన్ ప్రభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు చేరవేయవలసిందిగా తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో విష్ణు చిరంజీవులు ఆదేశించారు. వాగులు, వంకలు ఉన్నచోట ఆయా గ్రామాల వీఆర్‌ఏలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



క్రోసూరు : దొడ్లేరు-హసనాబాద్ రోడ్‌లో ఉన్న గద్దల వాగులో పూడిక తీయిస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రవికుమార్

వాగులలో పూడిక తీత

క్రోసూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాను హెచ్చరికల నేపథ్యంలో క్రోసూరు మండలంలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ వేముల నాగరాజు, ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా సోమవారం పరిస్థితులను పర్యవేక్షించారు. గద్దల వాగులో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్ సహకారం అందించారు. ఎంఈఓలు జి.కృష్ణ, ఎం గణేష్ ఒక ప్రకటన విడుదల చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపవద్దన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ బసవరాజు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా తీగలు తెగిపడితే తమకు సమాచార ఇవ్వాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అచ్చంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ సూచించారు. తుఫాన్ కారణంగా సోమవారం ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో, విద్యుత్ సిబ్బంది, వాటర్ సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తహసీల్దార్ ఫోన్ నెం.7032929394, ఎంపీడీవో: 9121102860, ఎస్ఐ: 8106050403, టీడీపీ మండల అధ్యక్షుడి ఫోన్ నెం:9989368156కు ఫోన్‌చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం సూచించారు.

● పెదకూరపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నీలి ధనలక్ష్మి తెలిపారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆయా గ్రామాల రెవెన్యూ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. వాగుల సమీపంలో, పల్లపు ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు.

● బెల్లంకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 28, 29 తేదీల్లో తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. యమ్మాజీగూడెం ముంపు బాధితులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

నకరికల్లులో కంట్రోల్ రూమ్

నకరికల్లు అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నకరికల్లులో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కే పుల్లారావు సోమవారం తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో వీఆర్వోలు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలన్నిటిలో మంగళవారం వైద్యశిబిరాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని డీటీ టీ కొండారెడ్డికి 9949559933 నంబర్‌లో తెలపాలని సూచించారు.

మాచర్లలో...

మాచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చంద్రవంక వాగు మీదుగా జమ్మలమడక, లింగాపురం వెళ్లే రహదారి, బొంబాయి బ్రిడ్జి, ఆజాద్ నగర్ ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణకు అధికారులను నియమించామన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో నాగార్జున సాగర్ కుడి కాలువ వద్ద పదిమంది గజ ఈతగాళ్లను ఉంచామన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే సెల్: 9849904027, 8520882876కు సమాచారం అందించాలన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు



అధికారులతో చర్చిస్తున్న డీఏవో జగ్గారావు

మాచర్ల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు సూచించారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ సహాయకుల కార్యాలయంలో మొంథా తుఫాన్ సన్నద్ధతపై అధికారులు సమావేశం నిర్వహించారు. రైతులు పంట కోతలు నిర్వహించవద్దన్నారు. పంట పొలాల్లో నీరు బయటకుపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తమ పరిధిలోని రైతులకు పంటలను కాపాడుకునేందుకు తగు సూచనలు చేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవోలు పాకుమారి, లక్ష్మారెడ్డి, అమీర్‌రెడ్డి, బాలాజీ గంగాధర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు, ముప్పాళ్ళ మండలంలోని కొన్ని గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి, వరి, మిర్చి పంటలను జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, డాక్టర్ వీవీ సత్యగోపాల్, సత్తెనపల్లి ఏడీఏ రవిబాబులు సోమవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. చేలల్లో ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలన్నారు. వర్షాలకు పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు వాడాల్సిన ఎరువులను, పిచికారి చేయాల్సిన మందుల వివరాలను వారు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో బీ సుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్తి, వరి పంటలను పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.నగేష్, ప్రధాన శాస్త్రవేత్త డా.పీవీ సత్యగోపాల్, సత్తెనపల్లి ఏడీఏ బీ రవిబాబు ప్రస్తుత సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. మండలంలోని ఇరుకుపాలెం, మాదల, రామకృష్ణాపురం గ్రామాలలోని పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్.శేషుబాబు,గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో పత్తి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

● క్రోసూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో రైతులు తగు సస్యరక్షణ చర్యలు పాటించి పంటలను కాపాడుకోవాలని క్రోసూరు ఏడీఏ పి.మస్తానమ్మ అన్నారు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంటలను ఆమె పరిశీలించారు. పత్తి చేలలో నీరు చేరితే బయటికి పంపాలన్నారు. అధికారులు సూచనలు పాటించాలన్నారు. ఎటువంటి సహాయం కావాలన్నా తమ వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఎల్లవ్వుడూ అందుబాటులో ఉంటారన్నారు. పత్తికాయలు పూత రాలిపోకుండా తగు జాగ్రత్తలన వివరించారు. ఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులో పత్తిపంటలను ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, ప్రిన్సిపల్ సైంటిస్టు సత్యగోపాల్ సోమవారం పరిశీలించారు. అధికవర్షాల బారినపడిన పత్తిపంటను కాపాడుకోవటానికి సస్యరక్షణ చర్యలను సూచించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు ఏవోలు జీ రవిబాబు, బీ కృష్ణయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



గౌతమ్‌రెడ్డి, తేజస్వినిరెడ్డి దంపతుల రిసెప్షన్‌లో సీఎం చంద్రబాబు

గౌతమ్‌రెడ్డి, తేజస్వినిరెడ్డి దంపతులకు సీఎం చంద్రబాబు ఆశీస్సులు

వెల్దుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో సోమవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి, తేజస్వినిరెడ్డి దంపతుల వివాహ రిసెప్షన్ పండుగలా జరిగింది. సీఎం చంద్రబాబునాయుడు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు, కుటుంబసభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. రిసెప్షన్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మారెళ్ల వంశి, కలెక్టర్ కృత్తికాశుక్లా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరిలు చిరుమామిళ్ల మధుబాబు, కళ్లం రామాంజిరెడ్డి, వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, తెలుగు యువత నేత మందలపు రామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మాచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, ఉపాధ్యక్షుడు గుండాల శ్రీనివాస్ యాదవ్, టీడీపీ ఎస్టీ సెల్ నేతలు వజ్రంనాయక్ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఎస్పీ కృష్ణారావు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

నియోజకవర్గంలో రూ.150కోట్ల అభివృద్ధి

క్రోసూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అమరావతి-బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు సాధించిన ఘనత ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దే నని టీడీపీ జిల్లా నాయకులు కంచేటి సాయిబాబు అన్నారు. సోమవారం పలువురు పార్టీ నాయకులతో కలిసి క్రోసూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రవీణ్ ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గంలో రూ.150కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గంలో అంతర్గత రహదారులు సీసీరోడ్లుగా మార్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మండల అధ్యక్షుడు మొగల్ జాన్, దిగుమర్తి అప్పారావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది

పిడుగురాళ్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలోకి రాకుండా ఎమ్మెల్యే యరపతినేని చొరవతోనే రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని కూటమి నేతలు పిల్లి చెన్నారావు, తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, షేక్ బాబావలి, కామిశెట్టి రమేష్ సోమవారం తెలిపారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేలా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కృషి వల్లే సాధ్యమైందని వివరించారు. వైసీపీ నేతలు మెడికల్ కళాశాల గురించి మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని చెప్పిన తరువాత కూడా వైసీపీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రకటనలో పాండురంగ శ్రీను, దూదేకుల ఖాశింసైదా, బిజెపి వెంకయ్య, పణితి రవి, సయ్యద్ అమీర్‌అలి, మందా డేవిడ్, తదితరులున్నారు.

పీఎంఏవై 2 దరఖాస్తులకు గడువు పొడిగింపు

రెంటచింతల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీ స్థలం ఉండి పీఎంఏవై 2 పథకం కింద గృహాన్ని పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని నవంబర్ 5 వరకు గడువును పొడిగించినట్లు హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.1.80లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సచివాలయాలు లేదా హౌసింగ్ కార్యాలయంలో పూర్తిచేసిన దరఖాస్తులను అందచేయాలన్నారు. లబ్ధిదారులు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు.

కిషోర్‌కుమార్‌కు అబ్దుల్ కలాం జాతీయ అవార్డు

గురజాలటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలోని జేఆర్ ఆర్ నవోదయా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గంటా కిషోర్‌కుమార్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. గుంటూరులో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ వహీద్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ అవార్డును అందించారు.

మృతుని కుటుంబానికి టీడీపీ నేతలు ఆర్థికసాయం



మృతుని కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నేతలు

కారంపూడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో సోమవారం జూలకంటి గౌతమ్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌లో పాల్గొని తిరిగివస్తూ కారంపూడికి చెందిన మట్టపల్లి శ్రీనివాసరావు గుండెపోటుతో మృతిచెందారు. టీడీపీ నేతలు, శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, మునుగోటి సత్యం, చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు నాగారపు రామకృష్ణ, బొల్నేడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 36 మందికి ఉద్యోగాలు

విజయపురిసౌత్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అలుగురాజుపల్లి న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25వ తేదీన చెన్నైకు చెందిన రీనాల్డ్ నిస్సాన్ ఆటోమోటివ్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో 36మంది కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. సోమవారం వీరిని వైస్ ప్రిన్సిపాల్ నరసింహారావు, టీపీవోడీ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదంలో సంగం డెయిరీ, ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంగం డెయిరీ వైద్యులు ప్రసాదు, శివరామకృష్ణ, పెద మక్కెన పశువైద్యాధికారి శ్రీదేవి పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి సుధాకర్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరికుమారి, పశు సంవర్ధక శాఖ సత్తెనపల్లి ఏడీ అనీల్‌కుమార్, పశు వైద్యులు పుల్లారెడ్డి, జేవీవోలు శ్రీనివాసరావు, వర ప్రసాదు, ఫణిదం పీఏసీఎస్ చైర్మన్ యర్రగుంట్ల వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ మహేష్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



అమరావతి: నదీతీరంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

మాచవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో మొదటి కార్తీక సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో మాచవరం, వేమవరం, పిల్లుట్ల, మల్లవోలు, పిన్నెల్లి తదితర గ్రామాల్లో మహిళలు ఆయా గ్రామాల శివాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు.

● దాచేపల్లి: మండలంలోని తంగెడ గ్రామంలో అలైక్యస్వామి ఆశ్రమంలో ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. కమిటిసభ్యులు మాట్లాడుతూ అలైక్యస్వామి శిష్యులు, భక్తుల ఆధ్వర్యాన కరువు కాటకాల నుంచి కాపాడాలని కోరుతూ చేసిన హోమంలో రుద్రాల అచ్చారావు, తంగెళ్ల శ్రీనివాసరావు, పగడాల భాస్కర్ రావు, చింతపల్లి హసన్‌అహ్మద్, తుమ్మల నారాయణ, బొమ్మిరెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: కార్తీకమాసం మొదటి సోమవారం పట్టణంలోని శివాలయాలలో మహిళలు, భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో దీపారాధనలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● నకరికల్లు: కార్తీకమాసం సోమవారం పురస్కరించుకొని చేజర్లలోని గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై కార్తీకదీపాలు వెలిగించి భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. కపోతేశ్వరునికి విశేష అభిషేకాలు చేశారు.

● క్రోసూరు: కార్తీకమాసం మొదటి సోమవారాన్ని మండలంలో భక్తులు వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో దీపాలు వెలిగించారు. మండలంలోని 88తాళ్లూరు, పీసపాడు, బాలేమర్రు పీసపాడు, విప్పర్ల, బయ్యవరం, అందుకూరు, దొడ్లేరు గ్రామాలలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● అచ్చంపేట: కార్తీకమాస సోమవారం కావటంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అచ్చంపేటలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో విరివిగా భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేసినట్టు ఆలయ నిర్వాహకకమిటీ అధ్యక్షుడు చలువాది అప్పారావు తెలిపారు.

● బెల్లంకొండ: బెల్లంకొండ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం గ్రామాల మహిళలు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. దేవదాయ శాఖ అధికారి ఎస్ కోటిరెడ్డి ఏర్పాట్లుచేశారు.

● పెదకూరపాడు: కార్తీక సోమవారం పలు దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలను చేశారు. పెదకూరపాడులోని శివాలయంలో వేకువజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకుంది.

● రెంటచింతల: కృష్ణానది ఒడ్డున సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునుంచే వేలాదిమంది భక్తులు నదిలో స్నానాలాచరించి అమ్మవార్లకు దీపారాధన చేశారు. గుంటుపల్లి వెంకట గాంధి, మహేశ్వరి దంపతులు సుమారు వేయిమందికి అన్నదానం చేశారు. ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ శివయ్య, మెంబర్లు, జెట్టిపాలెం టీడీపీ నేతలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● గురజాలటౌన్: మండలంలోని దైదలో ఉన్న శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు తెల్లవారుజామునే చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. ఈవో పూర్ణచంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ భాస్కర్ బందోబస్తు నిర్వహించారు.

● దుర్గి: మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. దుర్గి శివారులోని బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు.



అమరావతి: అమరేశ్వరాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు



గురజాల: దైద కృష్ణానది వద్ద స్నానాలాచరిస్తున్న భక్తులు

- చెట్లు, విద్యుత్ స్తంభాల జోలికి వెళ్లవద్దు
- సురక్షితమైన నిర్మాణంలోనే తలదాచుకోవాలి
- ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి
- విపత్తు నిర్వహణశాఖ అధికారులు

మొంథా.. జాగ్రత్త

అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తి స్తోంది. తీవ్ర తుఫాన్‌గా మారి రాష్ట్రం మీదుగా తీరం దాటనున్న నేపథ్యంలో కోస్తా జిల్లాల ప్రజల్లో వణుకు మొదలయింది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత తీరందాటనున్న నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లా చీరాల డివిజన్ పరిధిలోని తీరప్రాంతం సహా అన్ని ప్రాంతాలపై తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా అప్రమత్తమై ముందస్తు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. పాఠశాలలు, విద్యాసంస్థలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సంరక్షణ శిబిరాల్లోకి తరలిస్తున్నారు. ఎవరికివారుగా తగు అప్రమత్తతతో ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

● జాగ్రత్తలు ఇలా..

- తుఫాన్ సమయంలో, ఇంట్లో నుంచి బయటకు రాకుండా సురక్షితంగా ఉండాలి, బయటకు వెళ్ళవలసి వస్తే అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వీలయితే వెళ్లకుండా ఉండడమే మంచిది.
- రేకులు, పూరిల్లు, పెంకుటిళ్లలో నివసించేవారు పక్కా ఇళ్లలో సంరక్షణ పొందడం మంచిది.
- తుఫాన్ సమయంలో వీచే ఈదురుగాలులకు రేకులు, పైకప్పులు ఎగిరిపోయే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఆ ఇళ్లకు దూరంగా ఉండడం మంచిది.
- పక్కా ఇంట్లో ఉన్నా కిటికీలు, తలుపులు మూసుకుని ఉండడం మంచిది. తుఫాను గాలుల్లో కొట్టుకువచ్చే వస్తువులు ఇళ్లలోకి చొరబడి డ్యామేజీ చేయకుండా రక్షించుకోవచ్చు. అదే సమయంలో తలుపులు, కిటికీలకు దగ్గరగా ఉండకూడదు.
- పాత భవనాలు, గోడలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు ఉన్న చోట ఉండకూడదు.
- తప్పనిసరై బయటకు వెళితే.. రోడ్డుపై ఉండే విద్యుత్ స్తంభాలు, తీగలను గమనించుకుంటూ వెళ్లాలి. వాటికి దూరంగా వెళ్లడం మంచిది.
- గాలుల తీవ్రతకు చెట్ల కొమ్మలు విరిగి పడే ప్రమాదం ఉంది కాబట్టి చెట్ల కిందకు వెళ్లకూడదు. ఒక్కోసారి చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడి అవి తెగి నీటిలో పడే ప్రమాదం ఉంది. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. అలాంటివి గమనించిన వెంటనే విద్యుత్‌శాఖకుగానీ, కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలి.
- తుఫాన్ సంరక్షణకు సంబంధించి పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ, అగ్నిమాపకశాఖ, ఇతర రెస్క్యూ బృందాల ఫోన్ నెంబర్లు సేకరించి పెట్టుకోవాలి.
- అత్యవసర సహాయం కోసం పోలీసు, రెవెన్యూ, రెస్క్యూ బృందాల సహకారం తీసుకోవాలి తప్ప సొంత ప్రయత్నాలు చేయకూడదు.
- తుఫాన్ ప్రభావం మూడు, నాలుగు రోజులు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇంట్లోకి అవసరమైన తాగునీరు, నిత్యావసర సరుకుల వంటివి ముందుగానే సేకరించి పెట్టుకోవాలి.
- తుఫాన్ ప్రభావం ఉన్నంత సేపూ ఇంట్లోని మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచడం మంచిది. షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలను నివారించవచ్చు.
- ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలను ప్రధానంగా టీవీ, ఏసీ వంటి ఖరీదైన వస్తువులను ఉపయోగించకపోవడం మంచిది. వాటిని స్విచ్ ఆఫ్ చేయడంతో పాటు కనెక్షన్లు కూడా తొలగించి పెట్టుకోవడం అవసరం.
- వంటింట్లో గ్యాస్ కనెక్షన్‌ను కూడా తీసివేసి ఉంచడం మంచిది.
- తుఫాన్ సమయంలో పుకార్లు షికార్లు చేస్తుంటాయి. వదంతులు వ్యాపిస్తుంటాయి. వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. వాటి కారణంగా అనవసర ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలి.
- సమాచారం కోసం మొబైల్ ఫోన్‌ను ఎప్పటికప్పుడు చార్జ్ చేసుకుంటూ ఉండాలి. వాతావరణశాఖ, విపత్తు నిర్వహణశాఖలు పంపించే ఎస్ఎంఎస్‌లను చూసుకుంటూ ఉండాలి.
- విలువైన పత్రాలు.. అంటే ఇంటి దస్తావేజులు, సర్టిఫికేట్స్ వంటి వాటిని వాటర్ ప్రూఫ్ కవర్లు, కంటైనర్లలో భద్రపరుచుకోవాలి.
- రైతులు పొలాల్లోకి వెళ్లకూడదు. పొలాల్లోకి వెళితే పిడుగుపాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. అలాగని చెట్ల కింద కూడా నించోకూడదు. ఎత్తైన చెట్లపై పిడుగులు పడే ప్రమాదం చాలా ఎక్కువ.
- పశువులు, పెంపుడు జంతువులుంటే వాటికి కట్టిన తాడును విప్పి వదిలివేయాలి.
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదు.



అగ్నిమాపకశాఖ సన్నద్ధం

గుంటూరు సిటీ: మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి అత్యవసర పరిస్థితి సంభవించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ ఆర్ జ్ఞాన సుందరం తెలిపారు. గుంటూరు-1 అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా రెస్క్యూ ఎక్విప్‌మెంట్లను పరిశీలించి ప్రమాదం సంభవించినప్పుడు వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తుఫాన్ సమయంలో ఎలాంటి ప్రమాద సమాచారం అందినా వెంటనే సిబ్బంది అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని సహాయ సహకారాలు అందించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎంఏక్యూ జిలానీ, గుంటూరు జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస రెడ్డి, గుంటూర్-1 సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



గుంటూరు-1 అగ్నిమాపక కేంద్రంలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జ్ఞాన సుందరం, చిత్రంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలాని తదితరులు

అమరావతి : కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు



- కృష్ణానదిలో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు
- భక్తులతో కాకాని మల్లన్న సన్నిధి కిటకిట



పెదకాకాని : మల్లేశ్వరుడి సన్నిధిలో దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక శోభ

అమరావతి/పెదకాకాని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం నేపథ్యంలో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమరావతిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో నదీతీరం, క్యూలైన్స్ రద్దీగా మారాయి. పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపారాధన చేసి, పొంగలి నైవేద్యాలుగా చేసుకొని స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. క్యూ లైన్‌లో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత ఆలయాన్ని దర్శించి పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉపకమిషనర్ లీలాకుమార్ పర్యవేక్షించారు.



పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ



అమరావతి : క్యూలో బారులు దీరిన భక్తులు

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు నెలలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే డివిజన్ ప్రజాసంబంధాల అధికారి ఏ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07055 సికింద్రాబాద్-అనకాపల్లి ప్రత్యేక రైలు నవంబరు 6 నుంచి 27వ తేదీ వరకు ప్రతీ గురువారం నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా ప్రయాణిస్తుందని చెప్పారు. రైలు నంబరు 07056 అనకాపల్లి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు నవంబరు 7 నుంచి 28వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబరు 07033 కాకినాడ టౌన్-మైసూరు ప్రత్యేక రైలు నవంబరు 3 నుంచి 28వ తేదీ వరకు ప్రతి సోమ, శుక్రవారం, రైలు నంబరు 07034 మైసూరు-కాకినాడ టౌన్ స్పెషల్ నవంబరు 4 నుంచి 29వ తేదీ వరకు ప్రతి మంగళ, శనివారాలలో గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా ప్రయాణిస్తుందని, పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా నవంబరు 13వ తేదీన రైలు నంబరు 07409 అనకాపల్లి-యల్హాంక, నవంబరు 14వ తేదీన యల్హంక-అనకాపల్లి గుంటూరు, నరసరావుపేట, వినుకొండ మీదుగా ప్రయాణిస్తాయని శ్రీధర్ తెలిపారు.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

గుంటూరు/తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మంగళ, బుధవారాల్లో పలు రైళ్లను రద్దు చేస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. మంగళవారం రైలు నెంబరు 18463 భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 12806 లింగంపల్లి-విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17281 గుంటూరు-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17016 సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 12704 సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, రైలు నంబరు 07165 హైదరాబాద్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. అలాగే ఈ నెల 29 బుధవారం రోజున రైలు నంబరు 17244 రాయగడ-గుంటూరు, రైలు నంబరు 07166 భువనేశ్వర్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు. విజయవాడ గూడురు మార్గంలో పలు రైళ్లు రెండు రోజుల పాటు రద్దయ్యాయి. బెజవాడ-తెనాలి, తెనాలి-రేపల్లె, రేపల్లె-తెనాలి, రేపల్లె-గుంటూరు, గుంటూరు-తెనాలి, రేపల్లె-మార్కాపురం, మార్కాపురం-తెనాలి, తెనాలి-గుంటూరు, బెజవాడ-ఒంగోలు, ఒంగోలు-బెజవాడ,గుంటూరు-రేపల్లె, రేపల్లె-గుంటూరు రైళ్లు రద్దయాయి. కాగా టాటా-ఎర్నాకుళం రైలు 18189ను మార్గం మళ్లించారు. విశాఖపట్నం-తిరుపతి, తిరుపతి-విశాఖపట్నం రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

అమరావతి, గుంటూరులో రైల్వే కోచింగ్ టెర్మినల్స్

- రాజధానిలో నిర్మించే ఎయిర్‌పోర్టుకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ
- దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సీఎం సూచన

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని, గుంటూరు నగరంలో రైల్వే కోచింగ్ టెర్మినల్స్‌ను ఏర్పాటు చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే ముందుకొచ్చింది. దీని వల్ల భవిష్యత్తులో ఈ రెండు ప్రాంతాల నుంచి బయలుదేరే రైళ్ల సంఖ్య పెరగనుంది. అలాగే అమరావతి రాజధానిలో నిర్మించబోయే నూతన రైల్వేస్టేషన్ వినూత్నంగా ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సూచించారు. రాజధానిలో త్వరలో నిర్మించబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రతిపాదిత హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ అనుసంధానం చేయాలన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు రైలుమార్గాల పెండింగ్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ సోమవారం అమరావతికి వచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రైల్వే అధికారులతో సమావేశమై నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులపై చర్చించారు. గుంటూరు రైల్వే డివిజన్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టుల పైనా చర్చ జరిగింది. అమరావతి రాజధాని మీదుగా నంబూరు-ఎర్రుపాలెం నూతన రైలు మార్గం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. అమరావతి రాజధాని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్కడ నిర్మించబోయే రైల్వేస్టేషన్ వినూత్నంగా ఉండాలన్నారు. రైల్వేశాఖ కోరిన విధంగా కోచింగ్ టెర్మినల్స్‌కు అవసరమైన భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైల్వేశాఖ ప్రతిపాదించిన హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు.

కడలిలోకి.. కృష్ణమ్మ పరుగులు

(5వ పేజీ తరువాయి)

జలాశయంలో 98.04 శాతం మేర నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సోమవారం డ్యాంలో నీటి నిల్వ 305.92 టీఎంసీలు ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులకు గాను 587.70 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయానికి 37,366 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు, విద్యు త్ ఉత్పత్తికి వినయోగిస్తున్న నీటితో కలసి మొత్తం 37,266 కూసెక్కుల నీటిని డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు.

'చింత' లేకుండా..

సాగార్జున సాగర్ దిగువున ఉన్న కేఎల్ రావు పులిచింతల జలాశయం కూడా పూర్తి స్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఇది కూడా ఆగస్టులో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ కొన సాగుతోంది. పులిచింతల నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 41.63 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.27 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయం ఇన్‌ఫ్లో 33,835 క్యూసెక్కులు, ఇక్కడ నుంచి 57,896 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్, పులిచింతల జలాశయాలు పూర్తిస్థాయి నీటితో తొణికిసలాడుతున్నాయి.

ఏటా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి కొన్ని వేల మంది విద్యార్థులు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, రష్యా, ఉక్రెయిన్, చైనా వంటి దేశాల్లో ఎంఎస్, ఎంబీబీఎస్ వంటి కోర్సులు చదువుకునేందుకు వెళుతుంటారు. వీళ్లు కనీసం రూ. 30 లక్షలకుపైగా వెచ్చించి ఆయా దేశాలకు వెళుతుంటారు. అయితే అక్కడ ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వీళ్లకు ఎలాంటి భరోసా ఉండటం లేదు. కేవలం మెడికల్ ఇన్సూరెన్స్ మాత్రమే లభిస్తుంది. దీనికి కూడా దాదాపు రూ. 2.50 లక్షల వరకు అక్కడ చార్జ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు, దుండగుల కాల్పులు వంటి సంఘటనల్లో ఇక్కడి నుంచి వెళ్లిన ప్రవాసాంధ్రులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకొని, అప్పులు చేసి పంపిస్తున్న కుటుంబాలు వారి పిల్లలకు ఏమైనా జరిగితే ఆర్థికంగా చితికిపోతున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రవాసాంధ్ర భరోసా బీమా (పీబీబీ) 2.0 పథకాన్ని తీసుకొచ్చింది.

ప్రవాసాంధ్రులకు బీమా పథకం

- విదేశాలకు విద్య, ఉపాధి రీత్యా వెళ్లిన వాళ్లకు లబ్ధి
- మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా రూ.10 లక్షల సాయం



గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి రీత్యా విదేశాలకు వెళ్తున్న వారి ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం పీబీబీ 2.0 పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీని వల్ల విదేశాలకు వెళ్లిన వాళ్లకి ఏమైనా జరిగినా ఆర్థిక భరోసా లభిస్తుంది. నామమాత్రం బీమా ప్రీమియంతో ఈ పథకాన్ని ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ప్రభుత్వ రంగ సంస్థ) ద్వారా అమలు చేస్తోంది. రెండు రోజుల క్రితం ఈ పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు.

విద్యార్థుల కోసం...

విద్యార్థులు ఈ బీమా పథకం కోసం సంవత్సరానికి రూ. 218 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ. 10 లక్షల ఆర్థికసాయం లభిస్తుంది. ప్రమాదం వలన మరణించిన వారి భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించడానికి, అంగవైకల్యం కలిగిన వ్యక్తి స్వదేశానికి వచ్చేందుకు ఒక సహాయకుడితో పాటు సాధారణ తరగతి విమాన చార్జీలు చెల్లిస్తారు. ప్రమాదంలో గాయాలైతే ఆస్పత్రి ఖర్చుల కింద రూ.లక్ష వరకు చెల్లిస్తారు. ప్రమాదానికి గురై చదువు కొనసాగించడానికి అనర్హుడిగా గుర్తిస్తే ఆ వ్యక్తికి, ఒక సహాయకునికి స్వదేశం వచ్చేందుకు విమాన చార్జీలు చెల్లిస్తారు. బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకొనేందుకు పాసు పోర్టు మొదటి, ఆఖరి పేజీలు, వీసా/సివిల్‌ఐడీ/ అకామా/ఆఫర్ లెటర్ తప్పనిసరి. పూర్తి వివరాలకు ఏపీఎన్ఆర్ టీఎస్ హెల్ప్‌లైన్ నంబరు 8632340678, వాట్సాప్ నంబరు 8500027678ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఉద్యోగులు, వలస కార్మికులకు...

ఉద్యోగులు, వలస కార్మికులు ఈ బీమా పథకంలో చేరాలంటే 18 నుంచి 60 సంవత్సరాల మధ్యన వయస్సు కలిగి ఉండాలి. మూడేళ్లకు రూ. 590 ప్రీమియం చెల్లించాలి. వీళ్లకు కూడా ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ. 10 లక్షల ఆర్థికసాయం, స్వదేశానికి రావడానికి ఒక సహాయకుడితో సాధారణ తరగతి విమాన చార్జీలు చెల్లిస్తారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారి కుటుంబసభ్యులకు ఆస్పత్రి ఖర్చుల కింద బీమా కాలపరిమితి వరకు ఏడాదికి రూ. 50 వేలు చెల్లిస్తారు. ఉద్యోగ సమయంలో కంపెనీ యాజమాన్యంతో ఏదైనా సమస్యలు తలెత్తితే ఆ సమస్యల పరిష్కారానికి న్యాయ ఖర్చుల కింద రూ. 45 వేల వరకు చెల్లిస్తారు. ప్రమాదం వల్ల సంభవించే గాయాలు, అస్వస్థత, తదితరాల చికిత్సకయ్యే ఆస్పత్రి ఖర్చులు కింద రూ.లక్ష వరకు చెల్లిస్తారు.

మహిళలకు ప్రసూతి ఖర్చుల చెల్లింపు

బీమా ఉన్న ప్రవాసాంధ్ర మహిళలకు ప్రసూతి ఖర్చులు చెల్లిస్తారు. బీమా కాలపరిమితిలో సాధారణ ప్రసూతి ఆస్పత్రి ఖర్చుల కింద రూ. 35 వేల వరకు చెల్లిస్తారు. సిజేరియన్ అయితే రూ. 50 వేల వరకు చెల్లింపు చేస్తారు.

దూరవిద్య పీజీ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యాకేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎంఏ హిందీ, చరిత్ర కోర్సుల నాలుగు సెమిస్టర్లు, ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సు ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్ష ఫలితాలను దూరవిద్య సంచాలకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు సోమవారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ-వాల్యుయేషన్‌కు ఒక్కొక్క పేపర్‌కు ఫీజుగా రూ.960లు చెల్లించాలని, పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చే నెల 14లోపు వర్సిటీ దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు పంపాలని దూరవిద్య పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులాబ్దిన్ తెలిపారు. ఫలితాలు విడుదల కార్యక్రమంలో ఏఆర్ కృష్ణవేణి, ఉద్యోగులు కోదండపాణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజా జీవనానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు వచ్చే లోతట్టు ప్రాంతాల ప్రజలకు భోజన, వసతి ఏర్పాట్లు చేయాలని కోరారు. పట్టణ శివారు ప్రాంతాల్లో నీరు నిలవకుండా, వర్షపు నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా మున్సిపల్ సిబ్బంది కాల్వలను శుభ్రం చేయాలన్నారు. తుఫాను తీవ్రత తగ్గి, వాతావరణం చక్కబడే వరకు ఇళ్లలోనే ఉండాలని సూచించారు.



కాశినాయన ఆశ్రమం సమీపంలో చెత్తకుప్పలో పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

చెత్తకుప్పలో ట్రాన్స్‌ఫార్మర్

వినుకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం సమీపంలోని ఓ చెత్తకుప్పలో రాగి వైరు తొలగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెలుగు చూసింది. వారం రోజులుగా ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఈ ప్రాంతంలో ప్రధానరోడ్డులో ఉండటంతో వాహనదారులు అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించి దాంట్లో విలువైన ఆయిల్, రాగివైర్లను దోచుకొని ఈ ప్రాంతంలో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రూరల్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

30న వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

వినుకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 30వ తేదీన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి దివ్యకల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శుల నియామకం

శావల్యాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పరిపాలన సౌలభ్యం కోసం మండలంలోని వయ్యకల్లు, మతుకుమల్లి గ్రామాలకు కొత్తగా ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం మతుకుమల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రేపూడి రుద్రరాజును వయ్యకల్లుకు, ప్రస్తుతం వయ్యకల్లు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చింతా శ్రీనివాసరావును మతుకుమల్లికి ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు పాల్గొన్నారు.

ఏ పనికైనా చేయి తడపాల్సిందే!

● చక్రం తిప్పుతున్న హోంగార్డు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన బాధితులు ఆ హోంగార్డుకు చేయి తడపనిదే పనిచేయడని విమర్శలు ఉన్నాయి. నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే ఓ హోంగార్డు విధులకంటే లంచం తీసుకోవడంలోనే ఉత్సాహంగా పనిచేస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో సోమవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యుల నుంచి సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్ నుంచి విచారణ నిమిత్తం వెళ్లిన ఆ హోంగార్డు తొలుత బాధితుల వద్ద నుంచి కొంత నగదు వసూలు చేశాడు. అనంతరం విచారణ రిపోర్టు కోసం బాధిత బంధువులను స్టేషన్‌కు రమ్మన్నాడు. స్టేషన్‌కు వెళ్లగా ఈ కేసును సంతమాగులూరు పోలీసుస్టేషనుకు బదిలీ చేస్తున్నామని ఆ రిపోర్టులు అక్కడకు పంపించాలంటే ఖర్చు అవుతుందన్నాడు. అందుకు సమ్మతించిన బంధువులు రూ.200 ఇవ్వబోగా వేయి రూపాయలు ఇస్తేనే రిపోర్టులు ఇస్తాననటంతో బాధితులు లబోదిబోమన్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం: రూరల్ సీఐ రామకృష్ణ

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుదారులు, బాధితులు ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని సీఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం విచారణ రిపోర్టు కోసం డబ్బులు తీసుకున్న హోంగార్డుపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ధర్మ సంఘం నూతన కార్యవర్గం

చిలకలూరిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడిగా పసుమర్తి సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా రాచుమల్లు సూర్యారావు, కోశాధికారిగా శికాకొల్లి సుబ్బారావు, గౌరవాధ్యక్షుడిగా గుర్రం సాంబశివరావు ఎన్నికయ్యారు.

చిత్తడిగా కూరగాయల మార్కెట్ ఆవరణ

● ముురుగు, దుర్వాసనతో ఉక్కిరి బిక్కిరి
● వ్యాపారులు, కొనుగోలుదారుల్లో అంటువ్యాధుల భయం
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వినుకొండలోని ఎన్ఎస్‌పీ కాలనీలో బురదమయంగా ఉన్న కూరగాయల మార్కెట్

వినుకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే వినుకొండ ఎన్ఎస్‌పీ కాలనీలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ చిత్తడిగా మారుతోంది. వర్షం వచ్చిందంటే పాదచారులు కనీసం నడిచేందుకు ఇక్కట్లు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో శివయ్య స్తూపం సెంటర్ నుంచి కూరగాయల మార్కెట్‌ను ఎన్ఎస్‌పీ కాలనీలోకి మార్చారు. నాటి నుంచి నేటి వరకు సజావుగా వ్యాపారం కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ఎస్‌పీ కాలనీలో నివాస గృహాల తొలగింపుతో కాలనీ గుంతలమయంగా మారింది. దీంతో గతంలో నిర్మించిన రోడ్లన్నీ గుంతలమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్‌లో వర్షపునీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో ప్రధానకూడళ్లు మొత్తం చిత్తడిగా మారాయి. కొనుగోలుదారులు మార్కెట్‌లోని బురద తాకిడికి కాలు పెట్టలేని పరిస్థితి. కాలినడకన వెళ్లాలంటే అపరిశుభ్ర వాతావరణంతో నడవలేని పరిస్థితి. చిత్తడిగా ఉన్న నేలపై కుళ్లిన కూరగాయల దుర్వాసనతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఆ ప్రాంతంలో ఉండలేని పరిస్థితి. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యాధులబారిన పడతామేమోనని వ్యాపారులు, వినియోగదారులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు సమస్యపై దృష్టిసారించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

మొంథా తుఫాన్‌పై అధికారులు అప్రమత్తం

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



తుఫాన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారు. మునిసిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు 08647 253994 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు కోరారు. సంజీవ్ నగర్, శాంతి నగర్, సుబ్బయ్య తోట, ఈస్ట్ మాలపల్లె, శారద హైస్కూల్ రోడ్ తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలోని సుగాలీ కాలనీ హైస్కూల్, ఆర్వీఎస్ హైస్కూల్, మద్దినగర్ కమ్యూనిటీ హాల్, పెద్దనందిపాడు రోడ్డులోని జీఆర్ జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలు విద్యుత్ వస్తువులను, ఎలక్ట్రికల్ పోల్స్, నీటిలో ఉన్న కరెంట్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకరాదని, వాటికి దూరంగా ఉండాలని, చిన్న పిల్లలను నీటిలో ఆడుకోవడానికి పంపకూడదని, నీటిని కాచి, చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని సూచించారు. పరిసరాలలో వర్షం కారణంగా చెట్లు పడిపోవడం లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగితే కంట్రోల్ రూమ్‌కు తెలపాలని కోరారు. కాగా తుఫాన్ కారణంగా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులతో ఆయన మునిసిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ ఈ అబ్దుల్ రహీం, మేనేజర్ మొహిద్దీన్, శానిటరీ ఇనస్పెక్టర్లు సీహెచ్ రమణారావు, సునీత, ఏఈలు, మణి, అల్తాఫ్, అన్సారీ, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వర్లు, బి.రాజేష్, షేక్ ఖాదర్ పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ షేక్ రఫాని కోరారు.

రెవెన్యూ శాఖ ముందస్తు ఏర్పాట్లు

భారీ తుఫాన్ నేపథ్యంలో చిలకలూరిపేట మండల పరిధిలో పలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. తహసిల్దార్ కార్యాలయంలో 63018 51765 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. లోలెవెల్ చప్టాలు మునిగిపోయే ప్రమాదం ఉందని, వాగుల ప్రవాహం పెరిగితే రాకపోకలు నియంత్రిస్తామన్నారు. ఎక్కడైనా చెట్లు పడిపోతే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు.

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్

కాగా తుఫానును దృష్టిలో పెట్టుకుని 73826 23153 ఫోన్ నంబర్‌తో విద్యుత్ శాఖ అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. విద్యుత్ స్తంభాలు పడినా, వైర్లు తెగినా వెంటనే తెలియచేయాలని, వాటిని తాకరాదన్నారు.

వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో ...

వినుకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా ఈ నెల 28, 29 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పురపాలక సంఘం పరిధిలోని లోతట్టు ప్రాంత, శివారు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ సోమవారం తెలిపారు. వర్షం కారణంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పురపాలక కార్యాలయంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెం.08646-273656, పబ్లిక్ గ్రీవెన్స్ నంబరు 9933585666ను సంప్రదించాలన్నారు. జాషువా కళాప్రాంగణంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పూరిగుడిసెలు, పురాతన భవనాలు, లోతట్టు ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతుల్లో ఆందోళన

వినుకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తాకిడికి విఠంరాజుపల్లి, కంచర్ల, రావిచెట్టుపల్లి, గాంధీనగర్, వినుకొండ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. వర్షం తాకిడికి విఠంరాజుపల్లిలోని కూరగాయల పంట పొలాలు వర్షపునీరు చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంట సేపు ఎడతెరపి లేకుండా ఈ ప్రాంతంలో వర్షం కురిసింది. మరో రెండు రోజులు వర్షం తీవ్రత అధికంగా ఉందన్న సమాచారం మేరకు రైతులు ఆందోళన నెలకొంది.

● నూజెండ్ల: మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మిరప, పొగాకు, కంది పంటలు సాగుచేసిన రైతులకు ఈ వర్షాలతో పొలంలో నీరు నిలిచి ఉరకెత్తి పాడైపోతుండగా మెరక ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునేందుకు వర్షాలు ఆటంకంగా మారటంతో కలుపు ఉధృతిగా పెరిగి పంటను దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ప్రభావంతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం పెరిగింది. మండల కేంద్రంలో రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో తుఫాన్ సహాయక కేంద్రాలను అధికారులు నిర్వహిస్తున్నారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు



శివుడి బొమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పురస్కరించుకొని మండలంలోని లోని గ్రామాల్లో శైవ క్షేత్రాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ధ్వజస్తంభం వద్ద, దశ సహస్ర లింగం వద్ద, దేవాలయంలోని శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

శివుడి బొమ్మ వద్ద ఎమ్మెల్యే పూజలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం కావడంతో నరసరావుపేట పట్టణంలోని శివుడు బొమ్మను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఉన్న చిరువ్యాపారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● శావల్యాపురం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శావల్యాపురం, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శావల్యాపురంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న శివాలయంలో భక్తులు శివలింగానికి పాలాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని శివాలయాలు, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి గోగులపాడులోని చంద్రమౌళీశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి కొనకంచివారిపాలెంలోని వీరభద్రేశ్వర స్వామి సంతగుడిపాడులోని వెంకటేశ్వరస్వామి మాచవరం పరగటిచర్ల అన్నవరప్పాడు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

● చిలకలూరిపేట: పవిత్ర కార్తీక మాసం మొదటి సోమవారంను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాలాడాయి. చౌత్రా సెంటర్ శివాలయంలో శివలింగంకు 18 రకాల సుగంధ ద్రవ్యాలతో అర్చకులు శరత్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు.

● ఈపూరు: కార్తీకమాసం సోమవారం పురస్కరించుకొని మండలంలోని సంజీవ కొండపై మహేశ్వరునికి అర్చనలు అభిషేకాలు జరిపించారు. కొచ్చర్ల గంగా పార్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● నూజెండ్ల: మండలంలోని దేవాలయాల్లో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు వెలిగించారు.

● నరసరావుపేట రూరల్: పట్టణంలోని పాలపాడు రోడ్డులోని చిన్న శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా సామూహిక రామమేదుని సత్యనారాయణస్వామి వ్రతం సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు విద్యారత్న అవార్డు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావుకు హైదరాబాదు బ్రెయిన్ ఓ విజన్ సంస్థ విద్యారత్న అవార్డు అందజేసిందని కళాశాల చైర్మన్ షేక్ మీరావలి సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా అనేకమంది అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ ఈ ప్రతిభా అవార్డుల కోసం నామినేషన్లు సమర్పించారు. విద్యారంగంలో విశేషమైన కృషిచేసినందుకు దేశవ్యాప్తంగా ఏడుగురు ఎంపికయ్యారు. అందులో ఒకరైన ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావుకి విద్యారత్న ప్రతిభ అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని షేక్ మీరావలి అన్నారు. అభినందన సభలో డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావును కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమాలు సత్కరించి అభినందించారు.

52మంది ఎన్ఈసీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్న 52మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ప్రముఖ టీవీఎస్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 52మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు రూ.3లక్షల వార్షిక వేతనం అందుకోనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు విద్యార్థులను అభినందించారు.

వాసవి మెడికల్ కాంప్లెక్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చిలకలూరిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డులోని వాసవి మెడికల్ కాంప్లెక్స్‌లో రూ.17.3 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు సోమవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, మున్సిపల్ డీఈ అబ్దుల్ రహీం, 9వ వార్డు కౌన్సిలర్ చింతపల్లి విల్సన్, పట్టణ టీడీపీ అధికార ప్రతినిధి మల్లిబాబు పాల్గొన్నారు.



గుంతల్లో చేరిన వర్షపునీటితో బురదమయంగా ఉన్న పిచికలపాలెం రోడ్డు

అధ్వానంగా వినుకొండ-పిచికలపాలెం రహదారి

● ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు

వినుకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అధ్వాన రహదారితో వినుకొండ నుంచి శావల్యాపురం మండలం పిచికలపాలెం వెళ్లాలంటే గ్రామస్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని ఎస్సీ కాలనీ వద్ద ఆర్‌యూబీ ఏర్పాటు చేయడంతో విఠంరాజుపల్లి నుంచి పిచికలపాలెం వెళ్లే రైల్వేగేటును మూసివేశారు. దీంతో విఠంరాజుపల్లిలోని రైతులు, పిచికలపాలెం వాసులు నూతనంగా ఏర్పాటుచేసిన మట్టి రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో గుంతలమయంగా మారిన రోడ్డులో గత వారం రోజులుగా, ప్రస్తుతం తుఫాన్ కారణంగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్డు అంతా బురద, గుంతలమయంగా మారింది. కనీసం వాహనాలు పిచికలపాలెం నుంచి వినుకొండ రావాలన్నా, విఠంరాజుపల్లి గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లాన్నా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రాకపోకలకు వీలుగా రోడ్డును ఏర్పాటు చేయలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన కొమ్మాలపాటి



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కొమ్మాలపాటి శ్రీధర్, ఎంపీ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు హెలిప్యాడ్ వద్ద టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం స్వాగతం పలికారు. అనంతరం పల్నాడు జిల్లాలోని పలు అంశాలపై సీఎంకు శ్రీధర్ వివరించారు.

జాతీయరహదారిపై దాణా లారీ బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు



జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ, రహదారిపై పడిన దాణా సంచులు

యడ్లపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. చేపల దాణా లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా దాణా గోతాలు రోడ్డుపై చెలాచెదురుగా పడిపోయాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేపలదాణా లోడుతో ఒంగోలు నుంచి గుంటూరు వైపు బయలుదేరిన లారీ యడ్లపాడు పరిధిలోని ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్ పరిశ్రమ సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పల్టీ కొట్టింది. దీనితో లారీలోని దాణా గోతాలన్నీ రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోగా డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది గాయపడిన డ్రైవర్‌ను అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలపై ఆరా తీశారు. రోడ్డుపై పడిపోయిన దాణా బస్తాలను రోడ్డు పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

మంత్రి గొట్టిపాటిని కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరిగిన వరుస సంఘటనలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వివరించారు. సోమవారం చిలకలూరిపేటలోని మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి ఇటీవల పట్టణంలోని స్వర్గపురి-2లో విధులు నిర్వహిస్తున్న కాటికాపరి ఎఫ్రాన్ దారుణ హత్య, పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త బత్తిన నాగేశ్వరరావుపై అక్రమ కేసుల గురించి వివరించారు. కాటికాపరి హత్యకేసులో వెనుక మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాత్ర ఉందని కేసులో సూత్రధారులు, పాత్రదారులకు చట్టపరంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త బత్తిన నాగేశ్వరరావుపై అక్రమ కేసులు పెట్టి వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుల శంకర్, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, గాడిపర్తి రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలి

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి


నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆరోగ్యశ్రీ బకాయిల నిధులు విడుదల చేయాలని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో వైయస్ రాజశేఖరరెడ్డి పేరు ఇప్పటికీ ప్రతి పేదవాడి గుండెల్లో ఉందన్నారు. ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆసుపత్రుల కోసం కూటమి ప్రభుత్వం తక్షణమే గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నరసరావుపేటలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

● మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. పట్టణ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలోని నాలుగు డివిజన్లలో ప్రతిరోజు ఉదయం 5:30గంటలకు పారిశుద్య కార్మికులకు హాజరువేసి ఆరుగంటలకు కేటాయించడం జరుగుతుందన్నారు. వార్డుల వారీగా మధ్యాహ్నం 1గంట వరకు అన్ని వార్డుల్లో చెత్త తొలగించడం జరుగుతుందన్నారు. చెత్తను తీసుకువెళ్లే కంపాక్టర్లు ఏమైనా మరమ్మతులకు గురయితే వెంటనే రిపేరు చేయించడం జరుగుతుందన్నారు. పట్టణంలో ఆవుల యజమానులు వీధుల్లో వదిలి పెడుతున్నారని వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

కబడ్డీ క్రీడాకారుడు గద్దే హరీష్‌కు సత్కారం



గద్దే హరీష్‌ను సత్కరిస్తున్న ఎంఏఎం అధినేత ఎంఆర్ శేషగిరిరావు తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెహరాన్‌లో జరిగిన యూత్ ఆసియన్ గేమ్స్‌లో భారత కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించడంలో కీలక పాత్ర వహించిన గద్దె హరీష్‌ను ఎంఏఎం ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ తరఫున ఎంఏఎం కళాశాల అధినేత మేదరమెట్ల ఎంఆర్ శేషగిరిరావు సోమవారం నరసరావుపేటలో సత్కరించారు. ఈ పోటీలు బెహరాన్‌లో అక్టోబరు 22 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఏఎం డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృథ్వీరాజ్ అభినందనలు తెలిపారు. అదేవిధంగా గద్దే హరీష్‌ను వశిష్ఠ కళాశాల పీడీ సురేష్, డైరెక్టర్ మద్దుల సురేష్, గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ వైవీ చిరంజీవి, పల్నాడు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎన్.సురేష్‌లు శాలువాతో సత్కరించారు.